క్లుప్తంగా

నేడు మండలానికి ఎంపీ బండి సంజయ్ రాక



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని పెద్దసముద్రాల గ్రామానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, కేంద్ర మాజీ మంత్రి ఎంపీ ప్రకాశ్ జవదేకర్ రానున్నట్లు హుస్నాబాద్ మాజీ హౌజ్ ఫెడ్ చైర్మన్ బొమ్మ శ్రీరాంచక్రవర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం మహాజన్ సంపర్క్ కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని క్యాంపు కార్యాలయాన్ని బొమ్మ సందర్శించారు. సోమవారం ఉదయం 9గంటలకు బండి సంజయ్ పెద్దసముద్రాలకు చేరుకుంటారని, అనంతరం రామాయంపేట నుంచి ఎల్కతుర్తి జాతీయ రహదారి పనులను పరిశీలించి ప్రెస్‌మీట్ నిర్వహిస్తారన్నారు. ఆయనతో పాటు బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటటేశం, వేణుగోపాల్‌రావు, లక్ష్మారెడ్డి, గాజుల వెంకటేశ్ ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హుస్నాబాద్: పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తాలో ఉచిత లయన్స్ విజన్ సెంటర్‌ను లయన్స్ క్లబ్ విజన్ కేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు పూదరి దత్తాగౌడ్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దత్తాగౌడ్ మాట్లాడుతూ.. ప్రతిరోజు కంటి పరీక్షలను జపాన్ కంప్యూటర్‌తో నిర్వహిస్తామని తెలిపారు. కంటిలో శుక్లాలు ఉన్నవారికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆస్పత్రిలో నిర్వహిస్తామని తెలిపారు. వీరికి ఉచిత రవాణా, భోజన వసతి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ విజన్ కేర్ అధ్యక్షుడు మాదర్‌ఖాన్, సభ్యులు షకీల్, తమ్మనవేని రవీందర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

నియామకం



సంజీవ్‌కుమార్‌కు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ నంగునూరు మండల శాఖ అధ్యక్షుడిగా బొల్లు సంజీవ్ కుమార్‌యాదవ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సూర్యకుమార్‌వర్మ ఆదివారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ.. చేతి వృత్తిదారులకు రూ.లక్ష సాయం అందిస్తామని గొప్పలు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కులాలకే లబ్ధి చేకూరుస్తోందన్నారు. తన ఎన్నికకు సహకరించిన టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, చెలికాని యాదగిరి, జిల్లా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నగదు అందిస్తున్న స్నేహితులు

చేర్యాల(సిద్దిపేట): గుండెపోటుతో మృతి చెందిన తమ చిన్ననాటి స్నేహితుడి కుటుంబానికి బాల్యమిత్రులు అండగా నిలిచారు. పట్టణ కేంద్రంలోని 11వ వార్డుకు చెందిన జంగం రాజలింగం నాలుగురోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పదో తరగతి (1991–1992) బ్యాచ్ విద్యార్థులు రాజలింగం కుటుంబాన్ని పరామర్శించి, రూ.25వేల ఆర్థిక సాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వంగర వేణు, వీరబత్తిని రమేశ్, మంచాల కొండయ్య, బురగోని తిరుపతి, ఎం.నాగరాజు, కె.రవి, భాస్కర్, వెంకటేశ్, ప్రవీణ్, వెంకటేశ్, డి.భాస్కర్, హెచ్.సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా..



మిత్రుడి కుటుంబానికి నగదు అందిస్తున్న స్నేహితులు

దుబ్బాక: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి తమ వంతుగా సాయం అందించి స్నేహ బంధాన్ని చాటుకున్నారు తోటి స్నేహితులు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటకు చెందిన తహర్ పాషా 1992–93 బ్యాచ్ లచ్చపేటలో 10వ తరగతి చదువుకున్నాడు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తహీర్ పాషా మృతి చెందడంతో తోటి స్నేహితులు తమవంతు సాయంగా రూ.20వేలు ఆదివారం మృతుడి కుటుంబసభ్యులకు అందించి అండగా నిలిచారు.

జీపీ భవనానికి మోక్షమెప్పుడో?

- అసంపూర్తిగా నిర్మాణం
- స్లాబ్ వేసి వదిలేసిన వైనం
- పట్టించుకోని అధికారులు



స్లాబ్ వరకు వేసిన దృశ్యం

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జీపీలు ఏర్పాటు చేసి అవసరమైన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తోంది. కానీ కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ భవనాల నిర్మాణంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో నిర్మాణాలు ఏళ్లు గడిచినా ముందుకు సాగడం లేదు. మండలంలోని గౌరాయపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. పనులు నిలిపివేసి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 2016 సంవత్సరంలో పాత గ్రామ పంచాయతీ భవనం శిథిలావస్థలో ఉండగా దానిని కూల్చి వేసి నూతన భవన నిర్మాణం చేపట్టారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.13లక్షలు మంజూరు కాగా సదరు కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు చేపట్టి స్లాబ్ వేసి చేతులు దులుపుకున్నారు. భవన నిర్మాణ వ్యయం పెరగడంతో ప్రస్తుతం రూ.12లక్షలు అయితేనే భవనం పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. గ్రామ పంచాయతీ నిర్మాణంపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నోసార్లు విన్నవించినా..

గ్రామంలో జీపీ భవన నిర్మాణం కోసం పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. కమ్యూనిటీ భవనంలో గ్రామ పంచాయతీ నిర్వహణ కష్టంగా ఉంది. ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే భవన నిర్మాణం పూర్తి చేస్తాం.

–సద్దికృష్ణారెడ్డి, గౌరాయపల్లి, సర్పంచ్

నిధులు అవసరం

గౌరాయపల్లి గ్రామ పంచాయతీ భవన నిర్మాణం 2016 సంవత్సరంలో ప్రారంభించారు. అప్పటి నిర్మాణ వ్యయం ప్రకారం ఉపాధి హామీ నిధులతో రూ.13 లక్షలు మంజూరు చేయగా స్లాబ్ వరకు పూర్తి చేశారు. మిగతా పనులు పూర్తి చేయడానికి ఇంకా సుమారు రూ.12లక్షలు అవసరం.

–శివకుమార్, పంచాయతీరాజ్ ఏఈ

సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలి



నియామకపత్రం అందజేస్తున్న రాంమోహన్

నంగునూరు(సిద్దిపేట): నిరుపేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత యువతపై ఉందని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం సిద్దిపేట నియోజకవర్గ సమన్వయకర్త నార్లపురం రాంమోహన్ అన్నారు. ఆదివారం గట్లమాల్యాల, అక్కేనపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్‌వీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంమోహన్ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గట్లమల్యాల, అక్కేనపల్లి గ్రామ శాఖ అధ్యక్షులుగా రంగు సాయిచరణ్, మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు రవి, సమన్వయకర్త భిక్షపతినాయక్, కృష్ణారెడ్డి, వేణుగోపాల్, బాబు, తిరుపతి, వెంకటేశ్‌గౌడ్, నాగేంద్రం, రమేశ్, అశోక్, సంపత్ పాల్గొన్నారు.

సభ నిర్వహణకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి(సిద్దిపేట): తెలంగాణ ఆవిర్భావ వేడుకల సందర్భంగా బెజ్జంకిలో సభ నిర్వహించేందుకు ఆదివారం బాలికల ఉన్నత పాఠశాలలో మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ముఖ్య కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 17న నిర్వహించే వేడుకలకు ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, బిగుల్ల మోహన్, శేఖర్‌బాబు, బొనగిరి శ్రీనివాస్, చెన్నారెడ్డి, రాజు, సంతోష్‌కుమార్, నరేశ్ పాల్గొన్నారు.

పేదల భూములతో రియల్ వ్యాపారం



సభ్యులకు నియామక పత్రం అందజేస్తున్న నందన్‌గౌడ్

వర్గల్(గజ్వేల్): మండలంలోని పేదల వ్యవసాయ భూములను తీసుకొని వాటితో సీఎం కేసీఆర్ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తెరలేపారని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వర్గల్ మండల ఇన్‌చార్జి పూదరి నందన్‌గౌడ్ అన్నారు. ఆదివారం వర్గల్ సాయిరాం ఫంక్షన్‌హాల్‌లో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ యాదవ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. బీజేవైఎం మండల పూర్తిస్థాయి కమిటీని నియామకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేవైఎం బలోపేతమే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు శ్రమించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శేఖర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న ప్రజాప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు శంకర్ పంతులు ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అమ్మవారిని దర్శించుకున్నారు.

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): రైతు సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరిస్తున్నాయని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగుపల్లిలో ఆదివారం ఆత్మగౌరవ పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో దుబ్బాకలో జరిగిన అభివృద్ధే తప్పా, బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో ఒరిగిందేమీ లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నేరండ్ల భూమాగౌడ్, మద్దెల రాజేశ్, వెంకట్‌గౌడ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నియంత పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: అమరుల త్యాగఫలంతో ఏర్పడిన రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నియంత పాలన సాగిస్తున్నారని టీపీసీసీ డెలిగేట్ సభ్యుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 18న జరగనున్న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ కార్యక్రమంలో యువత పాల్గొనాలని పిలుపునిస్తూ ఆదివారం ప్రజ్ఞాపూర్ నుంచి పట్టణ శివారులోని శోభా గార్డెన్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. యూత్ డిక్లరేషన్ స్ఫూర్తితో తెలంగాణ యువశక్తిని మేల్కొలిపే దిశగా కాంగ్రెస్ పార్టీ ఈ క్విజ్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. క్విజ్ పోటీలో పాల్గొన్న వారికి నియోజకవర్గానికి 10 చొప్పున బహుమతులుంటాయని, ఈ ప్రాంత యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయపోలు(దుబ్బాక): మండల కేంద్రమైన రాయపోలులో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆదివారం సర్పంచ్ మౌనికరాజిరెడ్డి ఆవిష్కరించారు. సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ తెగింపు గొప్పదని, ఆమె అడుగు జాడల్లో నడవాలని వారు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు భిక్షపతి, నాయకులు పరశురాంలు, కృష్ణ, కరుణాకర్, రవి, స్వామి, మహేశ్ పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం



సభకు తరలివెళ్తున్న నాయకులు

చేర్యాల(సిద్దిపేట): కొత్తగూడెంలో ఆదివారం తలపెట్టిన సీపీఐ ప్రజాగర్జన సభకు చేర్యాల మండలం నుంచి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ ఆధ్వర్యంలో సీపీఐ కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా అందె అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్రానికి గత ఎన్నికల సమయంలో బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ వంటి అనేక హామీలు ఇచ్చి నెరవేర్చలేదన్నారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను బడా పెట్టుబడిదారులకు అప్పనంగా అమ్ముతూ పూర్తిగా దివాలతీయుస్తున్నారన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతన్నకు రుణమాఫీ, సాగునీరు, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి, ఉద్యోగ అవకాశాలు, లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్‌లు తదితర పథకాలు పూర్తిస్థాయిలో మంజూరు చేయడంలో విఫలం అయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు కుడిక్యాల బాలమోహన్, వలబోజు నర్సింహచారి, ఉడుగుల శ్రీనివాస్, పోన్నబోయిన మమత, కనకయ్య, సురేందర్, రోహిత్‌రెడ్డి, మల్లేశం తదితరులు ఉన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చైర్‌పర్సన్ వనిత

దుబ్బాక: ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. ఆదివారం సిద్దిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుబ్బాక ఆర్యవైశ్య సంఘం వారి సౌజన్యంతో అద్వైత ఆయుర్వేద ఆస్పత్రి వైద్యులు దుబ్బాకలో వైశ్య భవన్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపు కృష్ణమూర్తి మాట్లాడుతూ.. రక్తపోటు, ఆర్‌బీఎస్, గుండె సంబంధిత వ్యాధులతో పాటు పలు రకాల జబ్బులకు ఉచిత పరీక్షలు నిర్వహించామన్నారు. దాదాపు 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కూర వేణుగోపాల్, బీఆర్‌ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి, వైశ్య సంఘం ప్రతినిధులు సుభాష్, నాగభూషణం, ఆంజనేయులు, శంకర్, డాక్టర్లు మనోహర్, గాయత్రి, సిద్దిపేట లయన్స్ క్లబ్ కోఆర్డినేటర్ నర్సింలు తదితరులున్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



చిన్నకోడూరు(సిద్దిపేట): క్షీరాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, నాయకులు



శ్రీగిరిపల్లిలో..

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వం దివ్యాంగులకు అందిస్తున్న పెన్షన్ పెంచడంపై ఆదివారం చిన్నకోడూరులో దివ్యాంగులు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు దివ్యాంగుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉమేశ్‌చంద్ర, బీఆర్‌ఎస్ నాయకులు రాజలింగం, దివ్యాంగులు సురేశ్‌గౌడ్, భాస్కర్, రజనీ, సంతోష్, రాజు, శ్రీనివాస్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామానికి చెందిన పలువురు దివ్యాంగులు సర్పంచ్ చంద్రమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలుపుతూ వారి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పరామర్శ



గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ నాయకుడు దయాకర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: ఆస్పత్రుల్లో చికిత్స పొంది ఇళ్లకు చేరుకున్న పలువురు బీఆర్‌ఎస్ నాయకులను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మండల పరిధిలోని దిలాల్‌పూర్ సర్పంచ్ భర్త దయాకర్‌రెడ్డి మోకాలికి సంబంధించిన శస్త్ర చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి గజ్వేల్ పట్టణంలో దయాకర్‌రెడ్డిని పరామర్శించారు. అదే విధంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు ఆకుల దేవేందర్‌ను సైతం పరామర్శించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్, జెడ్పీటీసీ మల్లేశం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, బయ్యారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీర, మండల యూత్ అధ్యక్షుడు కుమార్, బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు మోహన్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రమాదకరంగా గుంత

మద్దూరు(హుస్నాబాద్): నిత్యం రద్దీగా ఉండే మద్దూరు మండలం నుంచి జనగామ జిల్లాకు వెళ్లే రహదారి పక్కన్న గుంతలు ప్రమాదకరంగా మారాయి. రోడ్డు పక్కన గుంతలతో ప్రమాదం పొంచి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ రహదారి గుండా నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు, పాదాచారులు వెళ్తుంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే హడావిడి చేసే అధికారులు ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం లేదు. గతంలో పలువురు వాహనదారులు ఈ గుంతలో పడి గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని స్థానికులు వేడుకుంటున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **వర్గల్ క్షేత్రం సందర్శన**

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రాన్ని ఆదివారం జెడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, మహిళా కమీషన్ చైర్‌పర్సన్ సునితాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్‌రావు తదితర ప్రముఖులు సందర్శించారు. శంకరమఠం ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొన్న కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీవిజయేంద్ర సరస్వతీ ఆశీస్సులు పొందారు. వారికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రశేఖరసిద్ధాంతి స్వామివారి సమక్షంలో జ్ఞాపికలు అందజేశారు.

◆ **13న జాబ్ మేళా**

చిన్నకోడూరు(సిద్దిపేట): ఈ నెల 13న సిద్దిపేట పోలీస్ కన్వెన్షన్ హాల్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్‌లు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక కృషితోనే ఈ నెల 15న సిద్దిపేటలో ఐటీ టవర్ ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. 700 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. బీటెక్ కంప్యూటర్ సైన్స్, బీటెక్ ఐటీ, ఎంసీఏ, ఎంబీఏ, బీకామ్ కంప్యూటర్, బీఎస్సీ కంప్యూటర్ చేసిన వారు జాబ్ మేళాకు రావాల్సిందిగా కోరారు.

నంగునూరు(సిద్దిపేట): సిద్దిపేటలో మంగళవారం నిర్వహించే జాబ్ మేళాలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఖచ్చితంగా ఉద్యోగం లభిస్తుందని ఎంపీపీ జాప అరుణాదేవి, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం నంగునూరులో వారు విలేకరులతో మాట్లాడుతూ.. సిద్దిపేట ప్రాంతం వారికి ఉద్యోగ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని 13 కంపెనీ ప్రతినిధులతో క్యాంప్ ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. ఆసక్తి గలవారు ఉదయం 9 గంటల వరకు చేరుకోవాలన్నారు.

◆ **నేడు 3కే రన్ పోటీలు**

హుస్నాబాద్: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హుస్నాబాద్ పట్టణంలో సోమవారం ఉదయం 3కే రన్ పోటీలు నిర్వహించనున్నట్లు హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల వెంకట్ తెలిపారు. ఉదయం 6 గంటలకు వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి పరుగు పందెం పోటీలు ప్రారంభమై, అనభేరి చౌరస్తా వరకు తిరిగి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో మొదటి మూడుస్థానాలు పొందిన పురుషులు, మహిళలకు నగదు బహుతులను ఇవ్వనున్నట్లు ఆకుల వెంకట్ తెలిపారు.

◆ **16 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్**

నంగునూరు(సిద్దిపేట): ఈ నెల 16 నుంచి 19 వరకు రాజగోపాల్‌పేట పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.300, ఇతరులు రూ.600 ఆన్‌లైన్‌లో 13 నుంచి 18 వరకు ఫీజు చెల్లించాలన్నారు. విద్యార్థుల ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్‌లో పాల్గొనే వారు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలన్నారు. రాజగోపాల్‌పేటలో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలను వెంట తెచ్చుకోవాలన్నారు.

◆ **మంత్రి హరీశ్‌రావును కలిసిన ప్రజాప్రతినిధులు**

జగదేవపూర్(గజ్వేల్): జగదేవపూర్ మండల చాట్లపల్లి సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రాచర్ల నరేశ్‌గుప్తా మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి గ్రామ అభివృద్ధిపై చర్చించారు. అనంతరం సర్పంచ్ జన్మదినం సందర్భంగా మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వద్ద ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ములుగు అంజిరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ గుండా రంగారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కావ్య దర్గయ్య, మండల కోఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, జగదేవ్‌పూర్ ఉపసర్పంచ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ **ధాన్యం డబ్బులు అందక రైతుల ఇబ్బందులు**

నంగునూరు(సిద్దిపేట): ధాన్యం అమ్మి 15 రోజులు గడిచినా డబ్బులు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎండీ ఇమ్రాన్ అన్నారు. ఆదివారం నంగునూరులో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. దశాబ్ది ఉత్సవాలు జరుపుతున్న ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. వడ్లు అమ్మిన రెండు రోజుల్లో బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ చేస్తామని అధికారులు చెప్పడంతో రైతులు బ్యాంక్‌ల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. డబ్బులు జమ చేయకుంటే రైతులతో కలసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

◆ **వాలీబాల్ టోర్నీ ప్రారంభం**

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం సూరంపల్లిలో వాలీబాల్ టోర్నీ ప్రారంభమైంది. దౌల్తాబాద్ మండల మాజీ జెడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకుడు చిందం రాజ్‌కుమార్ ఈ టోర్నీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులకు వాలీబాల్ కిట్లతో పాటు డ్రెస్‌లు ఉచితంగా అందజేశారు. క్రీడాకారులు ప్రతిభ కనబరిచి క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.